క్లుప్తంగా

ఇద్దరు యువతులు అదృశ్యం

గద్వాల క్రైం: యువతి అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మల్దకల్ మండలం కుర్వపల్లి గ్రామానికి చెందిన రజిత కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్ కోసం గురువారం గద్వాలకు వెళ్లారు. ఈ క్రమంలో రజిత దగ్గర్లోని షాపులో చాక్లెట్ తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. సాయంత్రం తండ్రి కృష్ణ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

ఆలయానికి వెళ్లొస్తానని..

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవిలకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. చిన్నకూతురు మీనాక్షి (24) తల్లిదండ్రులతో ఉంటోంది. ఈ క్రమంలో లక్ష్మీదేవి పెద్ద అల్లుడు కర్నూల్ ఆస్పత్రిలో ఉండడంతో ఈనెల 6న వెళ్లింది. సుంకన్న గొర్రెలు కాసేందుకు వెళ్లాడు. ఇంటి దగ్గర నానమ్మ సవరమ్మ, మీనాక్షి ఇద్దరే ఉన్నారు. 6న తల్లికి ఫోన్ చేసి 'ఎప్పుడు వస్తామని అడగడంతో ఆమె 7న వస్తానని చెప్పింది'. మీనాక్షి అలంపూర్ ఆలయానికి వెళ్లొస్తానని నానమ్మకు చెప్పి వెళ్లింది. తల్లి 7న ఇంటికొచ్చి చూడగా కూతురు కనిపించలేదు. ఆలయానికి వెళ్లిన కూతురు తిరిగి రాకపోవడంతో గురువారం లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆముదాలపాడులో వివాహిత..

ఉండవెల్లి: వివాహిత అదృశ్యమైన సంఘటన గురువారం చిన్నాఆముదాలపాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చిన్న ఆముదాలపాడుకు చెందిన గురుప్రసాద్, మేరమ్మ(34)లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురుప్రసాద్ ఈనెల 6న నంద్యాలకు గౌండ్ల పనికి వెళ్లాడు. భార్య ఫోన్ చేసి ఇంకా రాలేదు ఎందుకని అడగడంతో వస్తానులే అని నచ్చచెప్పాడు. మరుసటి రోజు 7న ఇంటి దగ్గర మేరమ్మ కనిపించడం లేదని గురుప్రసాద్‌కు పక్కింటి వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భర్త ఇంటికొచ్చి ఆమె కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుక్కలదాడిలో చిన్నారులకు గాయాలు

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో ముగ్గురు చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. వారిని అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స నిమిత్తం కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చిన్నారులు రిషి, తిరుమలేష్, విజయ్ కుమార్‌ల చేతులు, చాతిపై కుక్కలు దాడి చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

గురుకుల విద్యార్థినికి అస్వస్థత

గట్టు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థిని మానస గురువారం అస్వస్థతకు గురైంది. ఆమె ఊపిరి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో గురుకుల సిబ్బంది చెప్పారు. దీంతో హుటాహుటిన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో గద్వాలకు తరలించారు. ప్రస్తుతం మానస ఆరోగ్య పరిస్థితి కుదుట పడినట్లు గురుకుల సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

శాంతినగర్: విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడిన ఘటన వడ్డేపల్లి మండలంలోని తనగలలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తనగలకు చెందిన గుగ్గిళ్ల రాజుకు సంబంధించిన గేదె పచ్చిగడ్డి మేస్తుండగా, విద్యుత్‌స్తంభానికి అమర్చిన సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరు తాకింది. ఎర్త్‌వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో గేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని బాధితుడు పేర్కొన్నాడు. విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోవాలని రైతు కోరాడు.

శిథిలమైన భవనాలు కూల్చివేయండి

అయిజ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలమయ్యాయని, ప్రాణహాని జరగక ముందే కూల్చి వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బింగిదొడ్డిలో శిథిలమైన ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల కృష్ణ, శివారెడ్డి, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

అంధకారంలో గట్టు

గట్టు: మండల కేంద్రంలో సగభాగం గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గ్రామ పంచాయతీ దగ్గర ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి కాలిపోవడంతో సమస్య నెలకొంది. కొన్ని ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరా అయ్యింది. మరి కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. చీకట్లోనే గడపాల్సి వచ్చిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

మౌలిక వసతులు కరువు

- అయిజ కేజీబీవీలో విద్యార్థినులకు అవస్థలు
- శిథిలమైన పాఠశాల భవనం
- ఇరుకైన తరగతి గదులు


శిథిలావస్థలో అయిజ కేజీబీవీ భవనం


పెచ్చులూడిన భవనం పైకప్పు

అయిజ: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైస్కూల్ విద్యార్థులు 221 మంది, ఇంటర్ విద్యార్థులు 63 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2008లో అయిజలో కస్తూర్బా భవనం (గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్) నిర్మించారు. ఆ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మొత్తం ఐదు తరగతి గదులు, డైనింగ్‌హాల్, ఆఫీస్ రూం, స్టాఫ్‌రూం, కంప్యూటర్‌గది ఉన్నాయి. పైభాగంలో విద్యార్థులు విశ్రాంతి తీసుకోవడానికి 5 గదులున్నాయి. పైభాగంలో కిందిభాగంలో కలిపి మొత్తం 10 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిర్మించిన 10 సంవత్సరాలకే భవన శిథిలమైంది. ఇటీవల రూ.24 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. అయినా సమస్యలు అదేవిధంగా ఉన్నాయి.

విద్యార్థులకు తప్పనితిప్పలు

విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడం, విశ్రాంతి గదులు, స్నానపు గదులు అరకొరగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలకృత్యాలకు, స్నానానికి విద్యార్థులు క్యూలైన్‌లో ఉండాల్సి వస్తోంది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ పనిచేయడంలేదు. వంటగది చిన్నగా ఉంది. విద్యార్థులకు మూడుపూటలు వంటచేసేందుకు వంటమనుషులు ఇబ్బందులకు గురవుతున్నారు. వంట సరుకులు నిల్వ చేసుకునే స్టోర్‌రూం చిన్నగా ఉంది. డైనింగ్ హాల్ ఒక్కటే ఉండడంతో విద్యార్థులకు భోజనం చేయడానికి స్థలం సరిపోవడం లేదు. వరండాలో, ఖాళీ ప్రదేశంలో భోజనం చేస్తున్నారు. బాత్ రూంలు, మరుగుదొడ్ల తలుపులు శిథిలమయ్యాయి. నీటి సమస్య తీవ్రంగా ఉంది. బోర్‌వెల్ నీరు సరిపోవడం లేదు. వర్షం పడితే ఫస్ట్ ఫ్లోర్‌లోని డార్మెటరీ గదులు జల్లెడలా నీళ్లు కారుతాయి. పైకప్పు పెచ్చులూడుతున్నాయి. 284 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, వంటమనుషులు అందరూ ఇరుకైన భవనంలో ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు గదులు నిర్మించాలి..



విశ్రాంతి గదులు శిథిలమయ్యాయి. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. రాత్రి సమయంలో తరగతి గదుల్లోనే నిద్రించాల్సి వస్తోంది. సరిపడినన్ని మౌలిక వసతులు లేకపోవడంతో చదువుపై పూర్తిస్థాయిలో దృష్టిని పెట్టలేకపోతున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

– మహాలక్ష్మి, 10వ తరగతి, అయిజ

స్నానపు గదులు చాలడంలేదు..



కేజీబీవీ భవనంలో 6నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థుల కోసం నిర్మించిన స్నానపుగదులు, మరుగుదొడ్ల తలుపులు శిథిలమయ్యాయి. బకెట్లు పట్టుకొని బాత్‌రూంలకు వెళ్లాల్సి వస్తోంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఆర్వో ప్లాంట్ పనిచేయడంలేదు.

– జ్యోతి, 9వ తరగతి, చిన్న తాండ్రపాడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

పాఠశాల భవనం శిథిలమవడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించేందుకు అదనపు గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది. కేజీబీవీలోని సమస్యలన్నింటిని తెలియజేస్తూ డీఈఓకి వినతిపత్రం అందజేశాం.

– చెన్న బసమ్మ, ప్రత్యేక అధికారి

చేనేత కార్మికులే బ్రాండ్ అంబాసిడర్లు


నేత కార్మికుడిని సన్మానిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల: నేత కార్మికుల కష్టంతో వెలువడే ఉత్పత్తులను ప్రచారం చేయటానికి నేతన్నలే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ సూచించారు. కొండాలక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న నేత కార్మికుడు బావండ్ల వెంకటేష్‌ను గురువారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువకులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని చేనేత రంగంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి ఆరోగ్య సంరక్షణతో పాటు ఆ పరిశ్రమకు ప్రాణం పోయాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. అనంతరం టీపీసీసీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయిన చిన్ని నాగరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీమన్నారాయణ, మహేష్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, యల్లప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే విజయుడు హాజరవుతారని, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల లబ్ధిదారులు చెక్కులు తీసుకునేందుకు రావాలని కోరారు.

నేడు గట్టు తిమ్మప్ప జాతర



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల సమీపంలో గట్టుపై వెలసిన తిమ్మప్పస్వామి జాతర శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతిఏట శ్రావణ మాసం శుక్ల పంచమి రోజున శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మప్పస్వామి వారి జాతర నిర్వహిస్తారని తెలిపారు. తనగల, వెంకటాపురం, కిష్టాపురం, రాయలసీమలోని కొత్తకోట భక్తులు ఇంటి ఇలవేల్పుగా దైవాన్ని కొలుస్తారు. భక్తులు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఆదిశిలాక్షేత్రంలో సప్తాహ భజన

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. గురువారం కాకినాడకు చెందిన భజన మండలి సభ్యులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నిర్వాహకులు చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, దీరేంద్ర దాసు, అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి పాల్గొన్నారు.

గ్రామాలను పచ్చదనంతో నింపుదాం


మాచర్లలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చెన్నయ్య


జడిదొడ్డిలో మొక్కలు నాటిన ఎంపీడీఓ వెంకటయ్య


పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గట్టు: గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనంతో కళకళలాడే విధంగా చేద్దామని, గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మాచర్ల గ్రామాన్ని ఎంపీడీఓ సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, నర్సరీ పరిశీలించారు. మొక్కలు సిద్ధం చేయాలని, గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీఓ స్వామి పాల్గొన్నారు.

అయిజ: మండలంలో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో గుడిదొడ్డి, జడిదొడ్డి, యాపదిన్నె, కురవపల్లి, కిష్టాపురం, వెంకటాపురం, ఉప్పల క్యాంపు గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతినగర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి హిమబిందు కొంకల ప్రజలకు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వీధులు శుభ్రం చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి వరప్రసాద్, హనిమిరెడ్డి, బడేసాబ్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కలుకుంట్ల గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి గోవింద్‌నాయక్, ఎంపీఓ భాస్కర్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని వారు సూచించారు. మొక్కలు మానవళికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన అప్రోచ్ రోడ్డు



అయిజ: మండల కేంద్రంలో పాత బస్టాండ్-కొత్త బస్టాండ్‌ల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయినా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గురువారం వంతెనపై ఒకవైపు వాహనాలు వెళ్లేందుకు కాంట్రాక్టర్ దారి ఏర్పాటు చేయడంతో ప్రజలకు కొంత ఊరట కలిగింది. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి వంతెన ప్రారంభించాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


రేవులపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అబ్దుల్ సుకూర్

ధరూరు: కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం రాత్రి రేవులపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశానుసారం ఎస్‌ఐ అబ్దుల్ సుకూర్ నేతృత్వంలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. తద్వారా నేరాల సంఖ్య కాస్తైనా తగ్గుతుందన్నారు. బాల్య వివాహాలతో అనేక అనార్థాలు వస్తాయని, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలకు భరోసా కేంద్రం అందిస్తున్న సేవలను వివరించారు. మహిళలు, విద్యార్థినీలు వేధింపులకు గురైతే 8712670312కు కాల్ లేదా వాట్సాప్ చేయాలన్నారు.

రుణమాఫీకి అడ్డంకులు తొలగించండి

మానవపాడు: రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని గురువారం రైతులు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డిని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. అనంతరం రైతులకు ఫర్టిలైజర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన ఎరువులు తీసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ గోవింద్

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో ఎరువుల్లో నాణ్యత లోపించిందని రైతులు తెలపడంతో గురువారం డీఏఓ గోవింద్ నాయక్, ఏడీఏ సక్రియ నాయక్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో రైతులకు విక్రయించిన మందులో మట్టి ఎక్కువ ఉందని బుధవారం యజమానికి చెప్పగా, అలాంటిది ఏమీ లేదని ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో అధికారులకు చెప్పడంతో తనిఖీ చేశారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. దుకాణంలో మందును ల్యాబ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

నాగులపంచమి పూజలు



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మొదటి రోజు నాగులపంచమి సందర్భంగా ఆలయాల్లో, పుట్టలలో భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తా


అలంపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అలంపూర్ మండలంలోని 54 మంది లబ్ధిదారులకు, సీఎం సహాయ నిధి ద్వారా 12 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల 60 మంది లబ్ధిదారులకు మహిళా సమాఖ్య భవనంలో ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్ శర్మ, ఆర్‌ఐ ఆంజనేయులు, పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా చైర్మన్ గోపాల్, మున్సిపల్ చైర్మన్ కరుణ, వైస్ చైర్మన్ సుజాత, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి


అలంపూర్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత


మానవపాడులో మాట్లాడుతున్న సురేష్

అలంపూర్: పిల్లలకు పోషక ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ మానవపాడు సీడీపీఓ సుజాత అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఐకేపీ భవనంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు న్యూట్రీషన్ చాంపియన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ శిశువులకు, చిన్న పిల్లలకు అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు మండల సూపర్‌వైజర్ ఆస్మా ఆధ్వర్యంలో అనుబంధ పోషకాహార కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు సరైన పోషణ విధానాన్ని నిర్వహించాలని సీడీపీఓ సుజాత సూచించారు.

మానవపాడు: నవజాత శిశువు సంరక్షణ, తల్లి పోషకాహార ప్రాముఖ్యతపై మండల కేంద్రంలో ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత, పోషణ అభియాన్ సురేష్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు, ఏఎన్‌ఎమ్‌లకు, ఆశలకు న్యూట్రీషన్స్ చాంపియన్స్‌పై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్ర సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్‌ఎమ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు పాల్గొన్నారు.

గట్టు: ఎత్తుకు తగిన బరువు సరిగా లేని పిల్లలపై ప్రత్యేక దృష్టిని సారించాలని మెడికల్ సూపర్‌వైజర్ స్వర్ణలత కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశాలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజోళి: పిల్లల్లో పోషకాహార లోపాలను నివారించాలని మెడికల్ ఆఫీసర్ మధుబాబు, డాక్టర్ స్వప్న, ఐసీడీఎస్ అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో న్యూట్రీషన్ చాంపియన్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు ప్రమాదకరం


జల్లాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రామానాయుడు

మానవపాడు: పంటసాగులో రసాయనిక ఎరువులు అధికంగా వాడడంవల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని, రసాయనిక ఎరువులు వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గి, పంట దిగుబడి తగ్గుతుందని నవభారత్ ఫర్టిలైజర్ ఎల్ఎల్‌పీ ఫీల్డ్‌ఆఫీసర్ రామానాయుడు తెలిపారు. గురువారం మండలంలోని జల్లాపురం, బోరవెల్లి, పల్లెపాడు, చందూరు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సేంద్రియ, జీవన ఎరువులపై వివరించారు. వాటిని వాడటంవల్ల పెట్టుబడులు తగ్గించి, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పలు గ్రామాల్లో సేంద్రియ, జీవన ఎరువులను వాడాలని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో అయ్యస్వామి, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పొదుపు జీవితానికి మలుపు


మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ తపాల సూపరింటెండెంట్ సైదానాయక్

శాంతినగర్: పోస్టాఫీసుల్లో పొదుపు చేసుకుంటే భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా అసిస్టెంట్ తపాల సూపరింటెండెంట్ సైదానాయక్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో గురువారం పోస్టాఫీసు పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. బ్యాంకుల కంటే పోస్టాఫీసు పథకాల్లో వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుందని, పెన్షనర్లకు, వృద్ధులకు పథకాల్లో ఎక్కువ వడ్డీ రేటు వస్తుందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, పోస్టల్ ఎస్పీఎం కళావతి, బీఎంలు నాగేశ్వర్‌గౌడ్, నర్సింహులు, బీచుపల్లిగౌడ్, భారతి, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డిలు పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేత

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లి యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి నరసింహ పుస్తకాలతోపాటు మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం కొత్తగా అందజేసిన వివిధ క్రీడా వస్తువులతో ఎంఈఓ ఆటలు ఆడి విద్యార్థులను ఆనందపరిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు యాదయ్య, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ సభ్యులు నాగేష్‌యాదవ్, పరమేష్, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.

కూలీల డబ్బులు చెల్లించాలి

అలంపూర్ రూరల్: మండలంలోని గొందిమల్ల, బుక్కాపూర్, కోనేర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేపల్లె దేవదాస్, జి. రాజులు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. గొందిమల్ల, బుక్కాపురం, కోనేర్ గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు.

గొందిమల్లలో బీటీ ఏర్పాటు చేయాలి


గొందిమల్లలో నిరసన తెలుపుతున్న నాయకులు, ప్రజలు

గొందిమల్లలో పంచాయతీ కార్యాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు బీటీ ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేపల్లె దేవదాస్, జి రాజులు అధికారులను కోరారు. బురద నీటిలో ప్రజలతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాజు, ఆంజనేయులు, చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు, నర్సింహ, నాగరాజు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వినేశ్ ఫొగాట్‌కు మద్దతుగా ర్యాలీ

అయిజ: రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు మద్దతుగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ 140 కోట్ల భారత ప్రజల ఆకాంక్ష అయిన వినేశ్ ఫొగాట్‌ను ఒలంపిక్ ఫైనల్లో ఆడించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ వివిధ సంఘాల నాయకులు మహేంద్ర, అశ్వ మారెప్ప, అంజిబాబు, వీరేష్, సుబ్బు, ప్రకాష్, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


అయిజలో మానవహారం నిర్వహించిన వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు